క్లుప్తంగా

దేవాలయంలో చందనోత్సవం



గురజాల: నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలోని పల్నాడు యాదాద్రి నరసింహ స్వామి దేవాలయంలో చందనోత్సవం బుధవారం నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని పల్నాడు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామికి సుమారుగా 60 కిలోల గంధంతో చందన అలంకరణ చేశారు. స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులుతీరారు. ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సిన కల్యాణాన్ని పురస్కరించుకుని స్వామివార్లకు మంగళస్నానం పెళ్లి కుమారుడిగా, అమ్మవార్లను తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. నిజరూపంలో స్వామి వారిని దర్శించుకున్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ కె.పి.చారి

మాచర్ల: వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి.చారి సూచించారు. బుధవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం మాచర్ల ప్రాంతంలో 38 నుంచి 41 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని చెప్పారు. ఉదయం 11 గంటలోపు, సాయంత్రం 5 గంటల తరవాత ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు వేసవి కాలంలో ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. కూల్ డ్రింక్‌లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అనుగురాజు విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



పిడుగురాళ్ల: పల్నాటి రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తి అనుగురాజు యాదవ్ విగ్రహ ప్రతిష్ట కోసం బుధవారం భూమి పూజా మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈసందర్భంగా జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... పల్నాడు ప్రాంతానికి ముఖ ద్వారంగా ఉన్న పిడుగురాళ్లల్లో పల్నాటి రాజ్యాన్ని పాలించిన అనుగురాజు యాదవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, అనుగురాజు యాదవ్ విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలి



మాచర్ల: పట్టణంలో సొంత గృహం లేని రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడు నూతనంగా గృహనిర్మాణం చేయాలనుకుంటే ఆన్‌లైన్‌లో, హౌసింగ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు చెప్పారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఇల్లులేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు రుణం మంజూరు చేస్తుందన్నారు. సొంత స్థలం, బీ ఫారం, డీకే పట్టా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో, గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రాజారమేష్‌కు గౌరవ డాక్టరేట్ అవార్డు



శావల్యాపురం: ప్రెస్ క్లబ్ వేల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ సారథ్యంలో విశాఖపట్టణం ద్వారకనగర్ లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మండలం తుమ్మలకుంట ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు బిళ్లా రాజా రమేష్ గౌరవ డాక్టరేటు బుధవారం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు గ్రహీ తను ఎస్టీయూ సంఘం నేతలు చంద్రజిత్ యాదవ్, కొండ్రముట్ల వెంకటరత్నం, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అభినందించారు.

వాసవీ అమ్మకు గాజుల అలంకరణ



గాజులతో ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు



కుంకుమ పూజలలో పాల్గొన్న మహిళా భక్తులు

వాసవీ అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జానపాడు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం అమ్మవారికి రంగు రంగుల గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంకుమ పూజలు చేశారు.

– పిడుగురాళ్ల

వేసవిలో ఉపాధి పనులు కల్పించాలి



సమావేశంలో మట్లాడుతున్న పి.నాగశ్రీనివాసరావు

మాచర్ల: గ్రామాల్లో వేసవి కాలంలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు కీలక పాత్ర పోషించాలని మండల ఉపాధి హామీ అధికారి పి.నాగశ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఎండ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మంచినీటి సౌకర్యంతో పాటు మధ్యాహ్నం లోపు పనులు ముగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. వేతనదారులకు ప్రధాని సురక్ష బీమా పథకం సంవత్సరానికి రూ.20 వేలు చెల్లిస్తే రూ.2 లక్షలు బీమా పొందవచ్చు అన్నారు. జీవనజ్యోతి బీమా పథకంలో భాగంగా రూ.430 చెల్లిస్తే సాధారణ, ప్రమాద భరిత తదితర వారికి బీమా వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా ప్రతి గ్రామంలో సేద్యపు గుంతలు, ఇంకుడు గుంతలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు కిషోర్, వెంకయ్య, ఆపరేటర్ వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మాచర్ల: పట్టణంలో అన్ని వార్డుల్లో గురువారం తెల్లవారుజాము నుంచే ఇంటింటికి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ వేణుబాబు తెలిపారు. 6,500 మందికిగా పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

వాడవాడలా మే డే వేడుకలు

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘం, కేసీపీ కార్మికులు, ఉద్యోగులు, ప్రభుత్వ శాఖలో ఉద్యోగులు, కార్మికులు, భవన కార్మికులతోపాటు, పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే కార్యక్రమం నిర్వహించనున్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, అంబేడ్కర్, పురపాలక సంఘ కార్యాలయాల వద్ద ఉన్న ఏఐటీయూసీ, సీఐటీయూ, సీటీయూ, పలు వెల్ఫేర్ సంఘాలు, పెయింట్స్ అసోసియేషన్ సంఘాలు ర్యాలీ నిర్వహించి మేడే కార్యక్రమం నిర్వహిస్తారు.

యువతి అదృశ్యంపై కేసు

యడ్లపాడు: తమ కుమార్తె కనిపించడం లేదంటూ యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 15వ తేదీన రాత్రి మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన గూడూరి ఆదియ్య కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా ఆదియ్య పెద్దకుమార్తె స్రవంతి ఇంట్లో కనిపించలేదు. దీంతో బంధువులు, స్రవంతి స్నేహితులను కలిసి ఆచూకీ కోసం గాలించారు. తన 18 ఏళ్ల కుమార్తె ఆచూకీ ఎక్కడా లభించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి ఆదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు.

మహిళపై దాడి చేసిన ఇద్దరిపై కేసు

యడ్లపాడు: మహిళపై దాడి చేసిన ఇరువురిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన డేరంగుల మల్లేశ్వరి అనే మహిళ ఈనెల 23వ తేదీన తన ఇంటి బయట డ్రమ్ములో నీటిని నిల్వ చేసుకుంది. అయితే ఆమె బంధువులైన పల్లపు కోటేశ్వరరావు, సుజాత దంపతులు ఆమె అనుమతి లేకుండా అందులోని నీటిని వినియోగించుకున్నారు. ఇదేమని ప్రశ్నించిన మల్లేశ్వరిని అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు మల్లేశ్వరి నుంచి ఫిర్యాదు తీసుకున్న ఎస్ఐ టి శివరామకృష్ణ దాడి చేసిన దంపతులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాలువకు మరమ్మతులు చేయరూ!

వినుకొండ: బ్రాహ్మణపల్లి – విఠంరాజుపల్లి మధ్యలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కాలువ రిపేరు పనులు వెంటనే మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు పీడీఎం నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డు (తారురోడ్డు) వరకు ఒక కిలో మీటర్‌కు పైగా కాలువ రెండువైపులా కంప చెట్లు పెరిగి, రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు, దీనిపై అధికారలకి అర్జీలు పెట్టిన తరువాత ఇటీవల రెండు వైపుల సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగింది, అధికారులు నాలుగున్నర లక్షలు అంచనా వేసి పై అధికారులకు పంపామని తెలియజేశారు. సుదీర్ఘకాలం నుంచి కాలవ మరమతులకు నోచుకోకపోవడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని తగిన చర్యలు తీసుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, రైతులు పగడాల చినకోటిరెడ్డి, కంతరంగారావు, యాదల శంకర్‌రావు, నిసంకి వెంకటేశ్వర్లు, గాయం చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

- పొలాల్లో చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్న దుండగులు
- పట్టించుకోని అధికారులు



దుండగులు నరికివేసిన చెట్లు

మాచవరం: మండలంలో పలు గ్రామాల్లో కలప అక్రమ వ్యాపారం నడుస్తోంది. వేసవికాలం కావడంతో పొలాల్లో ఎవరూ లేని సమయం చూసి దుండగుల ముఠా చెట్లను నరికి వేసి అక్రమంగా తరలిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని మల్లవోలు, పిల్లుట్ల గ్రామాల్లో గత కొన్ని రోజులుగా ఓ ముఠా ఈ దందాకు పాల్పడుతోంది. పిల్లుట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతా రెడ్డి పుల్లారెడ్డి పొలంలో మంగళవారం ఏకంగా నాలుగు చెట్లను నరికి వేశారు. అదే సమయంలో కౌలు రైతులు చెట్లను నరికివేస్తున్న ముఠాను ఇదేమని ప్రశ్నించారు. భూ యజమాని వద్ద చెట్లను కొనుగోలు చేశామని, వాళ్ల అనుమతితోనే చెట్లను నరకుతున్నట్లు దుండగులు సమాధానం చెప్పారు. విషయాన్ని భూ యజమాని పుల్లారెడ్డికి తెలియజేయగా తాను ఎవరికి చెట్లను అమ్మలేదని, పొలాలనికి వెళ్లి చూడగా అప్పటికే దుండగులు నరికిన కలపను ట్రాక్టర్ల సాయంతో అక్రమంగా తరలించుకు పోయారు. దీంతో పుల్లారెడ్డి మాచవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా పలు గ్రామాల్లో భూ యజమానులకు తెలియకుండా చెట్లను నరికి వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పిడుగురాళ్ల ప్రాంతంలోని ఓ కలప మిల్లుకు వీటిని సరఫరా చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేషన్ పంపిణీకి ఆటంకం కలిగిస్తున్నారు!

పలుకూరు చౌకధరల దుకాణం డీలరు ఆవేదన

బొల్లాపల్లి: రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని మండలంలోని పలుకూరు చౌకధరల దుకాణం 40 డీలర్ పి. నాగసుధ ఆవేదన వ్యక్తం చేశారు. గత 9 ఏళ్లుగా రేషన్ షాపు నడుపుతున్నారని, సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి కార్డుదారులకు రేషన్ అందజేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ పంపిణీలో అవకతవకలు ఉన్నాయని ఆరోపణలు చేసి అధికారంతో కావాలని ఉద్దేశపూర్వకంగా అధికారులతో రేషన్‌షాపుపై కేసు నమోదు చేయించారని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు రేషన్ డీలర్‌గా కొనసాగేందుకు ఉత్తర్వులు వెలువడినా స్థానిక టీడీపీ నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని రేషన్ షాపును కొనసాగనివ్వకుండా చేస్తున్నారని వాపోయారు. మే నెలకు చెందిన రేషన్‌ను స్టాక్ పాయింట్ నుండి గ్రామానికి తరలించి రేషన్ షాపులో దించుతుండగా లారీ డ్రైవర్‌ను, కూలీలను బెదిరించారని, రేషన్ స్టాకును షాపులో దించకుండా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు గొడవపడి సరుకును వెనుక్కు పంపించారని తెలిపారు. రేషన్‌షాపు నిర్వహించకుండా రాజీనామా చేయి, నీవు ఎలా పంపిణీ చేస్తావో చూస్తామని బెదిరిస్తున్నారని, ఈ విషయంపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గతంలో కొన్ని ఏళ్లుగా ఎలాంటి లోపాలు లేకుండా రేషన్‌షాపు నడుపుతున్నానని, షాపు నిర్వహణకు ఆటంకం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు దృష్టిసారించాలని రేషన్ డీలర్ ఆవేదన.

ఉన్నది 32 – హాజరైంది 10 మంది!

- తూతూ మంత్రంగా మున్సిపల్ అత్యవసర సమావేశం
- కమిషనర్ లేరని వెళ్లిపోయిన చైర్మన్!



చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ: స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశం కౌన్సిల్ సభ్యులు లేక వెలవెలబోయింది. 32 వార్డు కౌన్సిలర్లు ఉండగా కేవలం పది మంది మాత్రమే హాజరైన మున్సిపల్ కమీషనర్ సుభాష్ చంద్రబోస్ కూడా సమావేశం సమయం దాటినప్పటికీ హాజరుకాలేదు. అజెండాలో 39 అంశాలు పొందుపరచగా అజెండా రూపొందించినప్పుడు తమకు తెలియకుండా ఎలా రూపొందించారని చైర్మన్ డాక్టర్ దస్తగిరి సమావేశం మందిరం నుంచి సీరియస్‌గా బయటకు వెళ్లిపోయారు. దీంతో అధికారులు, కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో సెట్ కాన్ఫరెన్స్‌లో ఉండటం వల్ల సమావేశానికి హాజరుకాలేకపోయానని, అందు కోసమే సమావేశానికి లేటుగా రావడం జరిగిందని వివరణ ఇచ్చారు. ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీ పార్టీ నుంచి టీడీపీలోకి వెళ్లిన చైర్మన్ డాక్టర్ దస్తగిరి ఇలా ప్రవర్తించడం పట్ల కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్ ఎక్కించిన 'నిద్రమత్తు'!



యడ్లపాడు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వేగంగా ప్రయాణిస్తున్న లారీ హైవే డివైడర్‌పైకి ఎక్కడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కడప నుంచి కోల్‌కోతాకు వెళ్తున్న బత్తాయిలోడు లారీ, యడ్లపాడు సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో అదుపుతప్పి లారీ నేరుగా డివైడర్ మీదకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో హైవే సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఇనుపకంచెతో పాటు లారీ ముందు భాగం తీవ్రంగా ధ్వంసమైంది. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడం స్థానిక ప్రజలు పెనుప్రమాదం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని తొలగింపు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ప్రయాణాల్లో నిద్రమత్తు ప్రమాదాలకు కారణమవుతుందని, డ్రైవింగ్ చేస్తున్న వారు తరచూ విశ్రాంతి తీసుకోవాలని, అలసటలో వాహనం నడపొద్దని ఎస్ఐ టి.శివరామకృష్ణ సూచించారు.

అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఎంపీ లావుకు అందజేస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి రూ.లక్ష విరాళంగా అందేజేశారు. విరాళాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ద్వారా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అందించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థగా అక్షయపాత్ర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం, విద్యను అందించేందుకు ఈ ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. లక్షలాది మంది పిల్లలు పౌష్టికాహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి వారికి సహాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

దాచేపల్లి చైర్‌పర్సన్ సుబ్బమ్మ



నగర పంచాయతీ సమావేశం అధ్యక్షత స్థానంలో చైర్‌పర్సన్

దాచేపల్లి: వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ కోరారు. దాచేపల్లి సచివాలయం–1లో కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చేపట్టే పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన బోర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. మంచినీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని, సురక్షితమైన నీటిని మాత్రమే ప్రజలకు అందించాలని కోరారు. నగర పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ వైవీ అప్పారావు, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఖాళీలు ఎస్టీ 32 సీట్లు, ఎస్సీ విద్యార్థులకు 5, బీసీ 1, ఓసీ 1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు మే 1వ తేదీ నుంచి ఈ గురుకుల పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాల కోసం 9441921023 సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బాలుర గురుకుల పాఠశాలలో..

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నాయని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ ఒకటి ఉన్నాయని వివరించారు. అలాగే 6,7,8,9 తరగతులలో బ్లాక్ లాగ్ ఖాళీలు అయినందున ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పించబడుతుందన్నారు. మే 1వ తేదీ నుంచి 25వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించబడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ. పవన్‌కుమార్ తెలిపారు. వివరాల కోసం 9493029257, 9491573682 సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ శిక్షణకు క్యాడెట్స్ ఎంపిక



శిక్షణకు ఎంపికైన క్యాడెట్స్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ శిక్షణకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాకేష్ బుధవారం తెలిపారు. ఈనెల 25, 26తేదీలలో చీరాల, గుంటూరులో నిర్వహించిన ఎంపికలో క్యాడెట్స్ పి.గీత సాయిశ్రీవల్లి, పి.లిఖిత నందిని, బీపీఎస్ వినయ్‌కుమార్, బి.కిషోర్‌భూపాల్, ఎ.యోగేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి శిక్షణకు ఎంపికైనట్టు వివరించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మే 13 నుంచి 25వ తేదీ వరకు శిక్షణలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ అభినందించారు.

కత్తితో బెదిరించి నగదు వసూలు

- బాధితుడి ఫిర్యాదుతో టూటౌన్‌లో కేసు నమోదు
- నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు

నరసరావుపేటటౌన్: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని కత్తితో బెదిరించి 1500 రూపాయలు నగదును తీసుకున్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక బుధవారం తెలిపారు. వివరాలు.. క్రిస్టియన్ పాలేనికి చెందిన దామవరపు నాగేశ్వరరావు ఈనెల 28వ తేదీ రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో తమ వీధిలో కొందరు యువకులు పెద్దపెద్దగా కేకలు వేస్తూ ఉండడంతో బయటకు వచ్చాడు. ఆ సమయంలో మల్లెల భాను ప్రకాష్ అలియాస్ బాల మరి కొంత మంది కలిసి కేకలు వేస్తున్నారు. అంతట వారిని మందలించి అక్కడి నుంచి పంపాడు. ఈ సంఘటన దృష్టిలో ఉంచుకొని ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో తన ఇంటి వద్దకు భాను ప్రకాష్ పొడవైన కత్తి తీసుకొని వచ్చి తన మెడపై పెట్టి తనకు తాగడానికి డబ్బులు ఇవ్వాలని లేకపోతే చంపేస్తాన ని బెదిరించాడని నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. భయపడి తన వద్ద ఉన్న రూ.1500లను ఇచ్చానన్నాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆయుధం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ఎంపీడీఓ సీతారామయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామయ్య

శావల్యాపురం: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు తప్పనిసరిగా కల్పించాలని ఎంపీడీఓ పేరు మీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతిరోజు 2300 మంది పంట కాల్వలు, పశువుల తొట్లు, ఇంకుడుగుంతలు, పంట కుంటలు తదితర పనులను చేస్తున్నట్లు తెలిపారు.వేసవికాలం కావటం చేత ఉష్ణోగ్రత తీవ్రత ఆధారంగా ఉదయం–సాయంత్రం సమయాల్లో పనులు చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్స్ బాధ్యత వహించాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. రూ.307 రూపాయలు ప్రభుత్వం వేతనం ప్రకటించగా కొలతలు ప్రకారం పనులు చేసిన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనం వస్తుందన్నారు. కూలీలకు వేతనాలు పెండింగ్‌లో లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు, ఏపీయం జి.వాసుబాబు ఉన్నారు.

కనుల పండువగా ప్రతిష్టా మహోత్సవం

నకరికల్లు: మండలంలోని త్రిపురాపురం గ్రామంలో ఆలయాల ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో శిలా విగ్రహ స్థిర ప్రతిష్టా మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరిపించారు. విఘ్నేశ్వరస్వామి వారి ధ్వజ స్తంభం, కల్యాణ వేంకటేశ్వరస్వామి, పోలేరమ్మ, పాతపాటేశ్వరి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి, పోతురాజు స్వామి, అంకమ్మతల్లి, నీలంపాటి అమ్మవార్ల స్థిర విగ్రహాలు, జీవధ్వజ, కీర్తి ధ్వజ ప్రతిష్టా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శిలా విగ్రహ స్థిర ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా కల్యాణ వేంకటేశ్వరుని శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. సమీప గ్రామాలతో పాటు పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు, బంధుగణంలో గ్రామం కిక్కిరిసింది. ధ్వజ స్తంభాలు ప్రతిష్ఠించే సమయంలో స్వామి వార్ల నామస్మరణలో భక్తులు పరవశించిపోయారు. మధ్యాహ్నం నుంచి చేపట్టిన మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. త్రిపురాపురం గ్రామంలో అత్యంత వైభవంగా జరిగిన ప్రతిష్టా మహోత్సవాల్లో వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి బాషా, మద్దం సురేష్, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో సన్మానించారు.